# పృథ్వి

తలుపు తాళం వేసి ఉంది.

విసుగ్గా పుస్తకాల సంచీ తలుపుకు వేసి కొట్టాడు పృథ్వి.

బంతిలాగ పుస్తకాల సంచీ వెనక్కి వచ్చింది. అది అట్లా వెనక్కి రావడం విచిత్రంగా కనిపించి, తమాషా చూడాలని ఇంకోసారి పుస్తకాల సంచీ తలుపుకు వేసి కొట్టాడు. ఇందాకటిలాగ ఈసారి సంచీ వెనక్కి రాలేదు.

“ఏమోయ్! పుస్తకాలు బావుండడం ఇష్టం లేదేమిటి?” దారిలో పోతూ పోతూ ఎవరో పెద్దమనిషి పృథ్విని ఉద్దేశించి అన్నాడు.

ఆయనవైపు విసుగ్గా, కోపంగా, నువ్వెవడివి అడగడానికన్నట్లు నిర్లక్ష్యంగా చూస్తూ నుదుటి మీద చెమట తుడుచుకున్నాడు పృథ్వి.

ఆ పెద్దమనిషి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. 'హైస్కూల్లో మర్రిచెట్టు మొదల్లా ఉన్నాడు; వెళుతున్న మనిషిని చూస్తూ అనుకున్నాడు పృథ్వి.

తలుపు ముందు మెట్టుమీద కూర్చుని రోడ్డు చూశాడు.

సైకిల్, ఎ.పి. 288 జీప్, సైకిల్, కంట్లోనించి పుసి కారుతున్న ఎద్దు, గజ్జికుక్క, ముగ్గురు రెండు జడల అమ్మాయిలు, ఒంటిమీద బురద పిడచకట్టుకుపోయిన రెండు పందులు, అయిదు పంది పిల్లలు, ఏలూరు మునిసిపాలిటీ పెంట లారీ కంపు, ఎ.సి.డబ్ల్యు. 109 చిన్న కారు, “నా డబ్బు, నా డబ్బు” అని అరుస్తూ పోతున్న పిచ్చివాడు, అయోమయంగా చూస్తున్న ముసలిది, సైకిల్, సైకిల్ రిక్షా, జాకెట్ లేకుండా చిరిగిన లంగా వేసుకున్న జీబుతల నల్లపిల్ల, ఖద్దరు టోపీ, పంచె లాల్చీ బొజ్జమనిషి, సైకిల్, లారీ, ఎర్ర ఏనుగు లాంటి ఆర్.టి.సి. బస్సు, నవ్వుతూ పోతున్న ఇద్దరు పోలీసులు, సైకిల్, బిగుతు పాంటు చారల చొక్కా కుర్రాడు, టెలిగ్రాఫ్ తీగల మీద మూడు కాకులు, ఎలక్ట్రిక్ తీగెల మధ్య ఇరుక్కుని తెలుగు పాఠం పుస్తకంలో శిలవమీద ఉన్న క్రీస్తు బొమ్మ లాగ - చచ్చి వేలాడుతున్న గబ్బిలం, రెండు గేదెలు, ఎముకలు వేసుకు వెళుతున్న లారీ మోగిస్తున్న హారన్, నల్లకుక్క, కంపు, దుమ్ము, మోత, మోత, దుమ్ము కంపు, వెగటు, విసుగు, కోపం, చికాకు....

లేచి నిలబడ్డాడు పృథ్వి.

మెట్టు దిగబోతూ మెట్టుకింద బియ్యం గింజ మెల్లిగా లాక్కుపోతున్న రెండు చీమల్ని చూసి ఆగాడు.

ఇంతలో ఇంకో చీమ వచ్చి, రెండు చీమల్లో ఒక చీమ మూతిని తాకి, బియ్యం గింజను ఇంకోవైపు కరిచి పట్టుకుని లాగడం మొదలెట్టింది.

బావుందే - అనుకుంటూ చీమల్ని దగ్గరనించి చూడాలని మళ్లా కూచున్నాడు. ఇంకో చీమ ఏదైనా వస్తుందేమోనని చూశాడు. రాలేదు. చిన్న రాయి తీసి, దాన్ని ఆ మూడు చీమల మీద పడెయ్యాలనుకున్నాడు. అవి చచ్చిపోతాయేమోనని రాయిని పారేసి, కుడిచేతి చూపుడు

వేలిని వాటికి అడ్డుగా పెట్టాడు. బియ్యం గింజ లాక్కుపోతున్న చీమలకు వేలు తగలగానే రెండు చీమలు బియ్యం గింజ వదిలేసి దొంగను కాపలాకాసే పోలీసుల్లాగా గింజ చుట్టూ తచ్చాడుతున్నాయి. మూడో చీమ మాత్రం వదలకుండా గింజ బలంగా ముందుకు లాగుతూంది. దూరంగా తిరుగుతున్న రెండు చీమల్లో ఒక చీమ మళ్లీ వచ్చి బియ్యం గింజ పట్టుకుంది. కాని ఇంకో చీమ మాత్రం ఎటో వెళ్లిపోతూంది.

పృథ్వికి కోపం వచ్చింది దానిమీద.

వేలిని బియ్యం గింజకు అడ్డు తీసేసి, వెళ్లిపోతున్న చీమను ఆ వేలితోనే నేలకు రాసేశాడు.

నిలబడ్డాడు.

మళ్లీ అతనికి విసుగు పుట్టింది. చికాకు వేసింది. పంపుల చెరువుకు పోవాలి. గాలి హాయిగా ఉంటుంది. చెరువు గట్టుమీద తిరగచ్చు. మందారపూలు ఏరి చేతులు నల్లబడేట్లు నలుపుతూ కూర్చోవచ్చు.

సంచీ చంకకు తగిలించుకుని, మెట్టు దిగుతూ తల వెనక్కి తిప్పి విసుగ్గా తాళం వేపు చూశాడు పృథ్వి.

అమ్మ ఎప్పుడూ ఇంతే "నువ్వు బడినుంచి రాకముందే వచ్చేస్తారా. కొంచెం ఆలస్యం అయితే కూర్చో, రాక ఎక్కడికి పోతాను నేను?" అంటుంది. రాదు; ఎక్కడికి వెళుతుందో సరిగ్గా చెప్పదు. మాటినీకో ఏదో ఆడాళ్ల సమాజానికో అంటుంది, ఎవరెవరివెంటో వెళుతుంది. వాళ్లెవర్ని ఇంటికి రానివ్వద్దని అమ్మకి చెప్పాలి. ఇప్పుడు అమ్మేం చేస్తుంటుంది? ఎక్కడుంటుందీ?.....

కర్ర వంతెన కింద ఏలూరు కాలవలో నీళ్లు విసుగ్గా, చికాగ్గా, ఎర్రగా కదులుతున్నాయి. ఎర్రటి రబ్బిషు రోడ్డు లాగా ఉన్నాడు అస్తమించబోతున్న సూర్యుడు. అయిదు గంటల సైరన్....

ఒకే సైకిల్ మీద కూర్చున్న ఇద్దరు కుర్రాళ్లు నవ్వుతూ పోతున్నారు.

కాలవ అవతలి గట్టుమీద బయటికి కూర్చుంటున్న వాడి మీదికి రాయి విసరాలనిపించింది పృథ్వికి. ఒకసారి ఎవడో అట్లాగే కూర్చుంటుంటే తనూ, రాంబాబు "హేయ్!" అని గట్టిగా అరిచిన సంగతి జ్ఞాపకం వచ్చింది అతనికి.

రాంబాబు ఉన్నా బావుండేది. విసుగు ఉండేది కాదు. అరిచే పని, గంతులు వేసే పని.

రేకు అర్చి మీదున్న ఏలూరు వాటర్ వర్క్స్ అన్న రాగిరేకు ఇంగ్లీషు అక్షరాల్ని ఒక్కొక్కటీ విడిగా చదివి, తరవాత 'ఏలూరు వాటర్ వర్క్స్' అని కలిపి చదివాడు పృథ్వి. పంపుల చెరువు అని తెలుగులో ఎందుకు వ్రాయలేదనుకున్నాడు..

చెరువు గట్టెక్కాడు. విశాలంగా ఉన్న చెరువులో ఎక్కడో మధ్యన తేలుతున్న బొగ్గులుగా ఉన్నాయి పరజలు. నీలంగా కనిపిస్తూన్న నీళ్లలో అక్కడక్కడా నల్లసిరా ఒలికిపోయినట్టుగా ఉంది తేలుతున్న నాచు.

చెరువులో దూకితే? నాకు ఈత రాదు. చచ్చిపోతాను. అప్పుడెప్పుడో ఆదివారం నాడు కాలవలో కొట్టుకు వచ్చిన మనిషి శవంలాగ ఉబ్బిపోయి కంపు కొడతాను. అమ్మ ఏడుస్తుందా? ఏమని ఏడుస్తుంది? "నీ పీడ ఎప్పుడు విరగడవుతుందిరా" అని కొడుకుని ఎప్పుడూ తిట్టే పక్కింటావిడ, తీరా కొడుకు జ్వరం వచ్చి వారం క్రితం చచ్చిపోయినప్పుడు, "దేవుడా! పండంటి బిడ్డణ్ణి లాక్కు వెళ్లిపోయావా?" అని ఏడ్చినట్టు ఏడుస్తూ, అమ్మ రొమ్ములు బాదుకుంటుందా? ఈత నేర్చుకోవాలి. ఆ సాయేబుగాడు కాలవలో చేపలాగ భలేగా ఈదుతాడు, వాడికి జలగలంటే అసలు భయమే లేదు!....

చెరువుగట్టు వంపు మూలన నలుగురమ్మాయిలు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ట్రాన్సిస్టర్ వింటున్నారు. దూరంగా పూచిక పుల్లలు నడుస్తున్నట్టుగా కుర్రాళ్లు. రెండో చెరువు అవతలిగట్టు మీద రెండు గాలి పటాలు - ఒకటి ఎర్రది, ఇంకోటి నీలంది - ఎగరేస్తున్నారు. ముగ్గురు కుర్రాళ్లు.

వీళ్లంతా నాలాగా విసుగుపుట్టి, చీకాకెత్తి ఇక్కడికి వచ్చి ఉంటారు. తను ఇంటిదగ్గర లేనప్పుడు నాకూ విసుగు పుడుతుందనీ, కోపం వస్తుందనీ అమ్మకు తెలీదూ? రాత్రులు కూడా నన్ను ఒంటరిగానే విడిచిపెట్టేసి వెళ్లిపోతుంది ఒక్కోసారి. మొన్నమట్టుకు మొన్నరాత్రి అట్లాగే చేసింది. బయట ఎవరో తలుపు తట్టితే లేచివెళ్లి, చూసి, మెల్లిగా మాట్లాడి, నేను నిద్రపోతున్నానేమో ననుకుని లేపి, "పృథ్వీ! లేమ్మా! మాట. మరే, మన పక్కింటావిడ రెండో ఆట సినిమాకు వెళదామంటూంది. వెళ్లివస్తాన్లే. నువ్వు నిద్రపోతావుగా. పడుకో, ఇదుగో పావలా, రేపు కొనుక్కుందువుగానిలే" అంది. "భయం అమ్మా" అంటే, "భయమెందుకూ? ఇదేమన్నా అడివా? ఇళ్లు ఉన్నాయిగా. తలుపేసుకో. పదకొండేళ్లు వస్తున్నాయి గదా, భయపడకూడదు మరి. పిరికివాడివౌతావు. గడియ వేసుకుని పడుకుని నిద్రపోమ్మా" అని బయటికి వెళ్లిపోయింది. గడియ వెయ్యడానికి లేచినప్పుడు బయటికి వెళ్లి అమ్మ ఎక్కడికి వెలుతూందో చూడాలని, ఒకటికి వెళుతున్నట్టుగా గోడవార కూచుని చూస్తే, మసక వెన్నెల్లో వీధి చివర నిలబెట్టి ఉన్న రిక్షాలో ఎక్కుతూంది అమ్మ. తెల్ల కుందేలు ఎర్ర కన్నుల్లాగ మెరుస్తూ కాలుతున్న సిగిరెట్టు నోట్లో ఉన్నవాడెవడో రిక్షా ఎక్కి అమ్మ పక్కన కూచుంటున్నాడు. "అమ్మా!" అని అరవాలనిపించింది. అరుపు రాలేదు. రిక్షా వెనక పరిగెత్తాలనిపించింది. కాళ్లు కదల్లేదు. రిక్షా వెళ్లిపోయింది. కోపం వచ్చింది. విసుగు వేసింది. నిద్రే పట్టలేదు. ఎర్రగా కాలుతున్న సిగిరెట్టు చుట్టూరా అమ్మ చెప్పిన మాటలు తిరుగుతూ, సిగిరెట్టులో కలిసిపోతున్నట్టనిపించింది. ఎప్పుడో రాత్రి వచ్చి, "పృథ్వీ! పృథ్వీ!" అంటూ తలుపు తట్టింది. గడియ ఓరగా తీసి చూస్తే అమ్మ పక్కన టోపీ చంకలో పెట్టుకున్న పోలీసు నిలబడి ఉన్నాడు. "ఇక ఆ లాడ్జికి వెళ్లకు. వాడికీ మాకూ పేచీ వచ్చింది. వాడి లాడ్జీ మీద రెయిడ్ చేస్తున్నాం" అన్నాడు పోలీసు. అమ్మ వాడి చేతిలో ఏమిటో, డబ్బులేమో, పెట్టింది. "వస్తా" అని అమ్మ లోపలికి వచ్చి గడియవేసే లోపల ఆ మాటలేం నిలబడి వినలేదన్నట్టుగా ఠక్కున వచ్చి పక్కమీద పడుకున్నా. పోలీసు మాటలు సరిగ్గా అర్థం కాలేదు....

పైన ఎగురుతున్న కాకి రెట్ట వేసింది. అది వచ్చి పృథ్వి చేతిమీద పడింది. తల పైకెత్తి

చూశాడు పృథ్వి. కాకిమీద కోపం వచ్చింది.

కాకుల్ని చంపెయ్యాలి. గురిచూసి కొట్టినట్టు కాకులు రెట్టలెట్టా వేస్తాయి?

చేతిమీద చొంగలాగ కారుతున్న తెల్లటి రెట్ట చూస్తుంటే పృథ్వికి ఛికాకనిపించింది, కాలవలోగాని చెరువులోగాని కడగాలనుకుంటూండగా సిగరెట్ పెట్టె డొక్కు కనిపిస్తే, దాన్ని తీసి దానితో రెట్ట తుడిచేసి, చేతిని పుస్తకాల సంచీకి రుద్దాడు. డోకు వస్తున్నట్టనిపించింది. చికాకనిపించింది.

చెరువు గట్టుదిగి కాలవ గట్టుమీదికి వచ్చాడు పృథ్వి. కాలవ ఆవలిగట్టూ, ఈవలి గట్టూ కూడా రబ్బిషు రోడ్డే. ఆవలిగట్టు పొడుగునా, రోడ్డు కవతలగా పాకలు, డాబాలు, పెంకుటిళ్లు ఉన్నాయి. ఈవలి గట్టున, రోడ్డుకు ఇతల ఎడమవైపుగా బాగా లోపలికి వెళితే మాలపల్లీ, తోళ్లషాపులూ ఉన్నాయి.

కడుపుతో ఉన్నావిడలా ఉన్న ఉబ్బిన తెరచాపతో మెల్లిగా వెళుతూంది కాలవలో పడవ. గోచీలు పెట్టుకున్న నల్లటి కుర్రాళ్లు ఇద్దరు గడ వేస్తూ, "కంటి కింపూ పిల్ల, ఒంటి గుందోరల్ల" అంటూ పాడుతున్నారు.

ఈ కాలవని ఏలూరు కాలవని ఎందుకంటారు? ఏలూరులో బయలుదేరే బస్సులాగ ఈ కాలవ ఇక్కడెక్కడైనా మొదలవుతుందా? లేకపోతే ఎక్కడినించో వచ్చి ఇక్కడ ఏలూరులో ఆగిపోతుందా ఇది? ముసలి సోషల్‌మాస్టార్ని అడగాలి. "ఒరేయ్, విచ్ఛిత్రప్పేరు పక్షీ! నీకన్నీ ఇటువంటి సందేహాలేరా" అంటాడు. కాని ఆయన సరిగ్గా చెప్పడు. అవును! నాపేర్లో విచిత్రం ఏమిటి? పృథ్వి అంటే భూమి అని తెలుగు మాస్టారు చెప్పారు. పడవ కుర్రాళ్లకు విసుగూ, చికాకూ ఏం ఉండవా? చీకట్లో అమ్మలాగ కాలవ ఎక్కడికో వెళుతూంది. అవతలి గట్టుమీద ఉన్న ఒకటి, రెండు, మూడు నాలుగు తాడిచెట్లు అమ్మవేపు తొంగిచూస్తూ అలల్లో వెకిలిగా నవ్వుతున్నాయి. ఆ చెట్ల వెనక, దూరంగా నాలాగ ఒక్కటే ఉన్నది అవిసి చెట్టు. చెట్టు సందుల్లోంచి దూరంగా ఉన్నా, ఎర్రగా కనిపిస్తున్నది ఒంటరి ట్రెయిన్ సిగ్నల్. రైలుబండి కింద మనుషులు ఎట్లా తల పెడతారు? నీళ్ల రబ్బరు బంతి పగిలినట్టుగా చిందేస్తుందేమో నెత్తురు. అమ్మ ఇట్లాగే విసుగు పుట్టించేస్తుంటే రైలుబండి కింద తల పెట్టెయ్యాలి. ముక్కలు ముక్కలైపోతాను. నెత్తురులో తడుస్తాను. తల పేలిపోతుంది. "మా పృథ్విది ఎంచక్కటి మొహం!" అని ముద్దుగా అమ్మ అనడానికి ఇంక ఉండను... వద్దు, చావకూడదు.....

పృథ్వికి మళ్లీ విసుగనిపించింది. విసుగు కలిగిస్తున్న వాటిమీద కోపం వచ్చింది. కాండ్రించి ఉమ్మెయ్యాలనుకున్నాడు. విసుగు ఏ కోడిపిల్లగానో, ఏ గండుచీమగానో మారి ముందుకు వస్తే చంపేసి ఉందుననుకున్నాడు.

లాకుల దగ్గరికి వచ్చాడు. చందమామ కథల్లో ఎద్దుల్ని మింగే రాక్షసుడి తెరుచుకున్న నోరులాగ ఉన్నాయి లాకులు.

లాకుమీద కూచున్నాడు. ఎదురుగా, ఏలూరు కాలవలో కలిసే తమ్మిలేరు వంతెనమీద వెళుతూన్న మేక కనిపించింది.

ఇప్పుడు రైలు వస్తే? మేక ఏట్లోకి దూకుతుందా? రైలు కిందపడి ముక్కలై చచ్చి

పోతుందా? రైలు వస్తే బావుణ్ణు. రైలు వస్తే బావుణ్ణు.

మేక గెంతుకుంటూ వంతెన దాటి, తమ్మిలేరు గట్టు పక్కనే ఉన్న కాలేజీ వైపు పోయింది.

కాలేజీలో చదువుకోవాలి పెద్దవాణ్ణయిన తరవాత.... అడ్డంగా పోతున్న ఏలూరు కాలవలో, నిలువుగా వచ్చి కలుస్తున్న తమ్మిలేరు తలకిందులైన లాగా భలేగా వుంది...!"

లాకుల్లోంచి ఒకే మోతలో పడుతున్న నీళ్ల శబ్దం వింటూంటే మళ్లీ విసుగు పుట్టింది పృథ్వికి. లేచి నిలబడ్డాడు. ముందుకు నడిచాడు. అటెక్కడా ఇళ్లులేవు. మనుషులు కూడా ఎక్కువగా అటు రారు.

ఇంకా ముందుకు నడుస్తూపోయాడు.

ఇరుగ్గా ఉన్న నిద్రగన్నేరు ఆకుల సందుల్లో నెత్తురు ముక్కలాగ ఉన్న అస్తమిస్తున్న సూర్యుణ్ణి నములుతున్నట్టున్నాయి గాలికి కదులుతున్న చెట్టు కొమ్మలు.

ఏలూరు కాలవనించి బయలుదేరిన పిల్లకాలవ ఒకటి కనిపించింది.

కాలవకు ఇవతలవైపు ఇసుకలో చాకలివాళ్ల నల్లటి బానలు, వాలుగా ఉన్న బండలు, చాకలి పొయ్యిలూను. చాకలివాళ్లు ఎవరూ లేరు.

బయలుకి వెళ్లాలనిపించింది పృథ్వికి.

పిల్లకాలవ గట్టున కాస్త దూరం వెళ్లి ఆగిపోయాడు.

అక్కడ, కాలవకి ఇవతల, చాకిరేవు దగ్గర, గుండీలు లేని చిరిగిన చెడ్డీ కట్టుకున్న నల్లటి కుర్రాడు కనిపించాడు.

'నాకంటె ఒకటి రెండేళ్లు చిన్నాడేమో! తొమ్మిదేళ్లు ఉంటాయేమో!'

పొడుగ్గా ఉన్న ఈత బెత్తానికి తాటినార పోగు కట్టి ఉచ్చువేసి, చాకలిబండ చివర ఉన్న తొండపిల్ల మెడకి ఉచ్చు తగిలించాలని జాగ్రత్తగా చూస్తున్నాడతను.

పృథ్వి అక్కడికి రావడం చూసీ చూడనట్టు చూశాడతను.

తొండపిల్ల అందంగా, గోధుమ రంగుమీద చామన ఛాయతో నున్నగా, అమాయకంగా ఉంది. ఎటో చూస్తుంది.

ఉచ్చు నేర్పుగా దాని మెడకిందికి వచ్చేటట్టు ఈత బెత్తాన్ని మెల్లిగా కదుపుతున్నాడు గుండీలు లేని చెడ్డీ ఉన్న కుర్రాడు.

భలేగా ఉంది తమాషా, అనుకున్నాడు పృథ్వి.

అంతలోనే ఆ కుర్రాడు తొండపిల్ల మెడ కిందికి ఉచ్చు పోనిచ్చి, ఈత బెత్తాన్ని పైకెత్తేశాడు. ఎగిరి ముందుకు దూకబోయిన తొండపిల్ల మెడకి ఉచ్చు బిగుసుకు పోయింది. అతను హుషారుగా ఈలవేసి తొండపిల్ల గిలగిలలాడుతుంటే బెత్తాన్ని గిర్రున తిప్పాడు.

"ఏయేయ్! ఆగు, చూద్దాం!" అని అంటుండగానే, బహుశా పృథ్వి వచ్చి తొండపిల్లని విడిపించేస్తాడనుకున్నాడేమో ఆ కుర్రాడు బెత్తానికి వేలాడుతున్న తొండపిల్లని బండమీద గట్టిగా కొట్టి, ఏమిటన్నట్టు పృథ్వి వైపు చూశాడు.

పృథ్వికి కోపం వచ్చింది.

గబగబా వెళ్లి తొండపిల్లని చూశాడు. కదలకుండా. చచ్చినట్టుగా, లేకపోతే చచ్చే పడి ఉందది. కుడి దవడ కింద సన్నటి నెత్తురు చారిక ఉంది.

తొండపిల్ల సన్నటి కాళ్లూ, వేళ్లూ, మెరిసే కళ్లూ, నున్నటి ఒళ్లూ, సన్నటి తోకా చూస్తూ దాన్ని కొంచెం సేపు తమాషాగా ఆడించి, అప్పుడు చంపాలనిపిస్తే చంపడమో, లేదూ విడిచి పెట్టెయ్యడమో చెయ్యవచ్చనుకున్న పృథ్వికి అట్లా నిర్జీవంగా పడి ఉన్న తొండపిల్లని చూడగానే దాన్ని అట్లా చేసిన కుర్రాడి మీద కోపం వచ్చింది.

హఠాత్తుగా ఆ కుర్రాడు ఈత బెత్తాన్ని దూరంగా విసిరి పారేశాడు.

పృథ్వికి ఈసారి విపరీతంగా కోపం వచ్చింది.

పృథ్వి అతని దగ్గరికి వెళ్లి, "దాన్ని ఎందుకురా చంపావు?" అని చాచి చెంపమీద కొట్టాడు.

"నీయమ్మ, లంజకొడక! కొడతావురా?" అంటూ అతను పృథ్వీమీదికి చెయ్యి విసిరాడు కాని, పృథ్వి వంగి దెబ్బ తప్పుకుని నల్లకుర్రాణ్ణి వెనక్కి తోశాడు. అతను ఇసుకలో వెల్లకిలా పడ్డాడు. బూతులు తిడుతూ వెంటనే లేచి, దోసిలితో ఇసుక పృథ్వి మొహం మీదికి చిమ్మాడు.

అతను చేసిన పనికి పృథ్వికి చికాకనిపించి, కోపం ఇంకా ఎక్కువైంది. అతన్ని పట్టుకుని చితగ్గొట్టాలనిపించింది. కాని ముందుకు అడుగు వెయ్యాలంటే వాడింకా అట్లాగే దోసిలితో ఇసుక చిమ్ముతున్నాడు. ఇసుకపడి కళ్లుమండి మెరమెరలాడుతున్నాయి. కళ్లలో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి. ముక్కుల్లోకి కూడా ఇసక వెళ్లి చికాగ్గా ఉంది. తలంతా ఇసుకే.

ఏమైనా సరే వాడిపని పట్టాలనుకున్నాడు పృథ్వి.

కళ్లలో ఇసుక పడకుండా ఉండడానికి తల కుడివైపు తిప్పి, మూసుకున్న కళ్లు బలవంతంగా తెరిచి చూశాడు. అందుబాటులో దాదాపు సగం విరిగి ఉన్న ఇటిక కనిపించింది. తటాలున దాన్ని అందుకొని బలంగా నల్లకుర్రాడి మీదికి విసిరాడు.

ఇసుక పృథ్వీమీద పడడం హఠాత్తుగా ఆగిపోయింది. "అమ్మో!" అని పెద్ద కేక.

పృథ్వి కళ్లు నులుముకుంటూ చూశాడు.

బోర్లాపడి ఉన్నాడు కుర్రాడు. పృథ్వి అతని దగ్గరికి వెళ్లాడు. అతని ఎడం చెంపా, కన్నూ, ముక్కూ, నెత్తురులో తడిసిన ఇసుకలో కూరుకుపోయినట్టుగా ఉన్నాయి. కింది పెదవి కుడిచివర నెత్తురు చారికలు ఉన్నాయి.

పృథ్వికి హఠాత్తుగా భయం వేసింది.

వాడు చచ్చిపోయాడేమో, చచ్చిపోయి ఉంటాడు. మరి కదలడేం తొండపిల్లలాగ? చచ్చిపోయి ఉంటాడు. ఇక్కడ ఉండకూడదు. వెళ్లిపోవాలి.

అక్కడ ఎవరన్నా ఉన్నారేమోనని చూశాడు. ఎవరూ లేరు. దూరంగా వీపుమీద కాకి కూచుని ఉన్న ఆవు తీరిగ్గా పచ్చగడ్డి మేస్తూంది. దాన్ని ఈ నల్లకుర్రాడు కాస్తున్నాడేమో అనుకున్నాడు పృథ్వి.

గబగబా పిల్లకాలవ గట్టెక్కి పరిగెత్తుతూ ఏలూరు కాలవ గట్టుమీదికి వచ్చేశాడు. అటూ ఇటూ చూసి, ఎవరూ లేరనుకున్నాక పుస్తకాల సంచీ కాలవలోకి విసిరిపారేసి పరుగు

లంకించుకున్నాడు.

లాకులదాకా వచ్చాడు. అక్కడా ఎవరూ లేరు.

బాగా సాయంత్రం అయిపోయింది. అమ్మ ఇంటికి వచ్చేసి ఉంటుంది.

అమ్మంటే అతనికి అంతకు ముందుకంటే ఎక్కువగా విసుగూ కోపం వచ్చాయి.

లాకులు దాటిన తరవాత నల్లకుర్రాడికి బాగా దూరం వచ్చానని అనుకున్నాక, పృథ్వికి భయం కాస్త తగ్గింది. దూరంగా ఎవరో వెళుతున్నట్టు కనిపించింది. తను పరిగెడుతుంటే వాళ్లకేమైనా అనుమానం రావచ్చని పరిగెత్తడం మానేసి ఒగరుస్తూ నడవడం మొదలెట్టాడు.

పంపుల చెరువు గట్టెక్కాడు. చెరువులో పరజలు లేవు. నలుగురు అమ్మాయిలూ లేరు. గాలిపటం కుర్రాళ్లూ లేరు. ఇంకెవరెవరో ఉన్నారు. కాలవ అవలి గట్టున అవిసె చెట్లూ, తాడిచెట్లూ అట్లాగే ఉన్నాయి. సిగ్నల్ అట్లాగే ఉంది. కాలవలో పడవలు లేవు.

కాలవా, కూతవేస్తూ అప్పుడే వెళుతున్న గూడ్సు బండీ, ఎలక్ట్రిక్ తీగెలూ, స్తంభాలూ, చెట్లూ, చెరువూ - అన్నీ అతనికి ఎర్రగా, నెత్తురులా కనిపించాయి.

ఇంతదూరం - చాలాదూరం - వచ్చేసిన తరవాత పృథ్వికీ భయం పోయింది. చెరువులో నీళ్లు తాగి గబగబా ఇంటికి బయలుదేరాడు.

బాగా చీకటి పడకపోయినా ఎలక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి.

ఇంటికి వచ్చి చూస్తే తలుపులకి తాళం ఇంకా అట్లాగే వేసి ఉంది.

అయినా, పృథ్వి ఈసారి బుద్ధిమంతుడిలాగ, ఎంతో సేపటినించి చూస్తున్న వాడిలాగ అమాయికంగా గుమ్మం ముందు మెట్టు మీద కూర్చున్నాడు రోడ్డుకేసి చూస్తూ.

మళ్లీ సైకిళ్లు, కార్లు, మనుషులు.

బరువై పోతుందేమోనని భయంవేసి పుస్తకాల సంచీ అనవసరంగా కాలవలో పారేశాను, తీసుకు వచ్చినా పోయేదనుకుంటూ మెట్ల కిందగ మళ్లీ చీమలేమైనా బియ్యం గింజను లాక్కుపోతున్నాయేమోనని చూశాడు.

చీమలూ లేవు, బియ్యపు గింజా లేదు.

అతనికి మళ్లీ అమ్మంటే, చీమల్లాగా, పాముల్లాగా పోతున్న మనుషులకంటే, మోతచేస్తూ, దుమ్ము రేపుతూ కంపు కొడుతూ, పోతున్న లారీలంటే, కారులంటే, నిర్జీవంగా నిలబడిఉన్న ఇళ్లంటే - విసుగనిపించింది. వెగటు తోసుకు వచ్చింది, విరక్తి లాంటిదేదో భావం కలిగింది.

గచ్చుమీద సున్నాలు చుడుతూ గజిబిజి గీతలు గీస్తూ కూచున్నాడతను. ★

(ఆంధ్రప్రభ - 1966)